క్లుప్తంగా

క్రీస్తు బోధనలు అనుసరణీయం



తెనాలి అర్బన్: క్రీస్తు బోధనలు అనుసరణీయమని రక్షణ సైనం చర్చి పాస్టర్ గేరా థామస్ పేర్కొన్నారు. ఐతానగర్‌లోని రక్షణ సైన్యం చర్చి పాస్టర్‌గా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణ సైన్యం చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గేరా థామస్, గేరా సీయోను కుమార్‌లను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేజర్ పి.నాగరాజు, మేజర్ పి.రత్న సుందరి, సంఘ సభ్యులు రవి, జక్రయ్య, నరసింహ, కనకరత్నం, ఆశీర్వాదం, పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీ ఆధ్వర్యంలో రూరల్ మండల గ్రామం బుర్రిపాలెంలోని ఇందిరాకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానికులకు షుగర్, బీపీ, హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్-ఎస్ఎఫ్ మెంటర్స్ జి.నందగోపాలకృష్ణ, పి.భార్గవి, అధ్యక్షుడు, డ్యూటీ డాక్టర్ ఎస్.సునీల్, ఏపీటీఏ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్. కె. వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ 1,2 విభాగాల ప్రోగ్రాం అధికారులు టి.జ్యోతిబసు, కె.కళ్యాణ చక్రవర్తి, యూత్ రెడ్ క్రాస్ ఏఎస్ఎన్ ఇన్‌చార్జి టి.లక్ష్మీదుర్గ, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పి.విజయలక్ష్మి హాజరయ్యారు.

ఉమామహేశ్వరుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని గరుడాచల పాలెంలోని అన్నపూర్ణ సమేత ఉమామహేశ్వర స్వామికి కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం విశేష పూజలు అర్చకులు లక్ష్మీ నారాయణశాస్త్రి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సోమవారం విశేష అర్చనలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆలయంలోని మూడు అడుగుల ఎత్తున పార్థివ లింగం(మట్టితో), ఆరు అడుగుల ఎత్తులో శీత లలింగాలు ఏర్పాటు చేసి విశేష అర్చనలు నిర్వహిస్తామని చెప్పారు. లక్ష ఒత్తులతో ఆలయం చుట్టూ భక్తులు దీపాలు వెలిగిస్తారన్నారు. స్వామికి సహస్ర బిల్వ దళార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మధుమేహ బాధితులలో మెదడు, నరాల సమస్యలు



గుంటూరు మెడికల్: మధుమేహం, శరీరంలోని ఏ ఒక్క అవయవాన్ని వదిలిపెట్టదని, ప్రతి అవయవంపై ప్రభావం చూపి వాటి అంతర్నిర్మాణంలో, పనితీరులో మార్పులకు దారితీస్తుందని న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.నటరాజ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్.హెచ్.ఓ. సమావేశ మందిరంలో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా'మధుమేహ బాధితులలో మెదడు-నరాల సమస్యల'పై అవగాహన సభ, ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. సభకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ నటరాజ మాట్లాడుతూ దీర్ఘకాల మధుమేహ బాధితుల్లో రక్తంలో అధిక శాతం షుగర్ ఉండటం వల్ల మెదడు, నరాలు అనేక విధాలుగా ప్రభావితం అవుతాయన్నారు. అటనామిక్ న్యూరోపతిలో శరీరంలోని అవయవాలను ప్రభావితం చేసే నాడులలో అసాధారణ మార్పులు వస్తాయని తెలిపారు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ మాట్లాడుతూ మధుమేహ బాధితులు మెదడు నరాల సమస్యలను ఏమాత్రం అశ్రద్ధ చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్.హెచ్.ఓ. మేనేజర్ పి.నిర్మల రాణి, జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మారెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కే సతీష్, సభ్యులు వి.సుబ్రహ్మణ్యం, ఎం.సాంబశివ రావు, సిహెచ్.శివాజీ పాల్గొన్నారు.

సందడిగా కార్తిక వన సమారాధనలు

పలు కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ



పద్మశాలీయ బహూత్తమ సంఘ వనసమారాధనలో మంత్రి మనోహర్



బ్రాహ్మణ పరిషత్ వేడుకలో రాధాకృష్ణమూర్తికి సత్కారం



రజక సంఘ వన సమారాధన

తెనాలి: బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఆధ్వర్యంలో స్థానిక బోసురోడ్డులోని నూకల రామకోటేశ్వరావు కల్యాణ కళా సదనంలో ఆదివారం కార్తిక సమారాధన నిర్వహించారు. ఉదయం మహాన్యాస పూర్వక ఏకాది రుద్రాభిషేకం అనంతరం జరిగిన సమావేశానికి పరిషత్ అధ్యక్షుడు కోట పార్థసారథి అధ్యక్షత వహించారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు రావూరి అంజనేయశర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని తెలిపారు. సొంత కార్యాలయం ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యదర్శి చింతపల్లి సాయికిరణ్ మాట్లాడుతూ ఇప్పటికే కార్యాలయం ఏర్పాటుకు పలువురు పెద్దలు వితరణ చేశారని, ఇంకా దాతలు సాయం చేయొచ్చని తెలిపారు. పరిషత్ మాజీ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై 70 మంది పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. పట్టణానికి చెందిన వీణా విద్వాంసురాలు పుచ్చ కనకదుర్గ కచేరి ఆహుతులను అలరించింది.

శ్రీపద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో..

పట్టణానికి చెందిన శ్రీపద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వైకుంఠపురం దేవస్థానం ఆవరణలో ఏర్పాటైన ఈ వేడుకలో తొలుత మృత్యుంజయశర్మ ఆధ్వర్యంలో శ్రీ మార్కండేయ మహాయజ్ఞం చేశారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా విచ్చేసి పూర్ణాహుతిలో పాల్గొన్నారు. పద్మశాలీయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు తిరువీధుల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పంచుమర్తి భాస్కర రావు, కోశాధికారి గట్టు బాలశ్రీనివాసరావు, పెద్దలు జొన్నాదుల కృష్ణ సత్యనారాయణ, జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు, తాడిపర్తి వరప్రసాదరావు, గౌరవ సలహా సభ్యులు గుంటి వెంకట్, దివ్య హేమంత్ కుమార్, అక్కల శ్రీరామ్ తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. మహిళలకు మెహందీ, ఆటల పోటీలు, బాలలకు భరతనాట్యం పోటీలు జరిపి బహుమతులు అందజేశారు.

రజక సంఘం ఆధ్వర్యంలో ...

రజక సంఘం ఆధ్వర్యంలో స్థానిక డిపో సెండరులో వనసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమాన్ని సుంకర కొండలరావు, సాంబయ్య, సాంబయ్య, నాగేశ్వరరావు, శోభనాచలం, అప్పారావు, సురేష్, వెంకట్రావు, రవిశంకర్, జగదీష్, మల్లికార్జున పర్యవేక్షించారు.

తూకంలో మోసాలకు పాల్పతున్న పది దుకాణాలపై కేసులు



చికెన్ షాపులో తూకం పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శేషసాయి

తెనాలి: తూకంలో మోసాలకు పాల్పడే వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ తెనాలి ఇన్‌స్పెక్టర్ బి. శేషసాయి హెచ్చరించారు. డెప్యూటీ కంట్రోలర్ టి.షాలేమ్‌రాజుఆదేశాలతో ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లోని చికెన్, మటన్, కూరగాయల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూకంతో పాటు మెషీన్లను పరిశీలించారు. తూకంలో మోసాలకు పాల్పడుతున్న పదిమంది వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. చినరావూరు తోట పరిసర ప్రాంతాలలో చికెన్, మాంసం దుకాణాల్లో మోసాలు జరుగుతున్నాయని గుర్తించి హెచ్చరించారు. సాధారణ కాటాలను వినియోగించే వ్యాపారులు, రాళ్లకు ఎప్పటికప్పుడు ముద్రలు వేయించుకోవాలని ఆయన సూచించారు. లైసెన్స్ లేని ఇద్దరు వ్యాపారులపైనా కేసులు నమోదు చేశారు. తూకం, కొలతల్లో ప్రజలను మోసగించటం నేరమే కాకుండా మహా పాపమని తెలిపారు. వీరితో టెక్నికల్ అసిస్టెంట్ ఎస్.రవికిశోర్ ఉన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సాయి లక్కరాజు



సాయి లక్కరాజుకు సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, రచయిత, లఘు చిత్రాల దర్శకుడు సాయి లక్కరాజు బహుముఖ ప్రజ్ఞాశాలిగా శనివారం రాత్రి జరిగిన ఆత్మీయ సమావేశంలో పలువురు అభినందించారు. వివిధ మాధ్యమాల ద్వారా సాహిత్యం, కళారంగాలకు సేవలనందిస్తూ, సందేశాత్మక లఘుచిత్రాలతో సమాజ చైతన్యానికి తోడ్పడుతుండటం గొప్ప విషయమని పేర్కొన్నారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటైన సమావేశానికి ప్రముఖ కవి పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. పట్టణానికి చెందిన వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. తెలుగు భాషావ్యాప్తికి రాష్ట్రంలోనే కాకుండా విదేశాల్లోనూ కార్యక్రమాల నిర్వహణలో సాయి భాగస్వాములు కావటం తెనాలికి గర్వకారణమని కొనియాడారు. ఆయన మాటల్లో హాస్యం, విరుపు, వ్యంగ్యం తొంగి చూస్తాయని తెలిపారు. ఇదే సందర్భంగా సాయి లక్కరాజు రచించి, సంగీత దర్శకత్వం వహించి, దృశ్యరూపంచేసిన 'ఇదే మా తెనాలి' చిత్రగీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయి లక్కరాజును సత్కరించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ విశ్రాంత సీఈవో డీవీ సుబ్రహ్మణ్యేశ్వర రావు, రావిపాటి ప్రేమకుమార్, డాక్టర్ జాస్తి సుబ్బారావు, తోటకూర వెంకటరమణారావు, సినీ నటుడు హేమంత్ పాల్గొన్నారు.

నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించండి

మంత్రి నాదెండ్ల మనోహర్



మురుగు కాల్వలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్: నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రోడ్డు నిర్మాణాలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. స్వరాజ్ టాకీస్ సెంటర్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. మురుగు కాల్వల్లో వ్యర్థాలు ఉండటాన్ని గమనించి ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారుల్లో కూడా వ్యర్థాలు ఉండటం ఏమిటంటూ ప్రశ్నించారు. వెంటనే వాటిని తొలగించాలని అధికారుల్ని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డీఎస్పీ జనార్దనరావు, ఓఎస్డీ ఏసురత్నం, జనసేన నాయకులు బందారు రవికాంత్ పాల్గొన్నారు.

శివాలయంలో మంత్రి పూజలు

తెనాలి రూరల్: పట్టణ గంగానమ్మపేటలోని పాత శివాలయంలో శ్రీ రామేశ్వర స్వామిని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటింగ్‌ను ప్రారంభించారు. ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, జనసేన పార్టీ నాయకులు ఉన్నారు.

దంత సంరక్షణపై జాగ్రత్తలు అవసరం



తెనాలి: షుగర్ వ్యాధి బాధితులు ప్రతి ఆరు నెలలకు దంత పరీక్షలు చేయించుకోవాలని దంత వైద్య నిపుణురాలు (ఇంప్లాంటాలజీ) డాక్టర్ హిమబిందు ఓగిరాల సూచించారు. వాకర్స్‌క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 'వృద్ధులు-దంత సమస్యలు-నివారణ' అనే అంశంపై డాక్టర్ హిమబిందు ప్రసంగించారు. దైనందిన జీవితంలో ఆహారం తీసుకున్న తర్వాత నీరు లేదా మౌత్‌వాష్‌తో నోటిని శుభ్రం చేసుకోవాలని తెలిపారు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని, లేనిపక్షంలో ఆహార పదార్థాలు పళ్లు, చిగుళ్ల మధ్య పేరుకుపోయి దంతక్షయానికి దారితీస్తుందని హెచ్చరించారు. ధూమపానం చేసే వారికి దంత సమస్యలు అధికంగా వస్తాయని తెలిపారు. షుగర్ బాధితులకూ దంత సమస్యలు అధికమని, ప్రతి ఆరు నెలలకు పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని చెప్పారు. సభ్యుల సందేహాలకు సమాధానాలిచ్చారు. యూఎస్‌వీ మెడికల్ కంపెనీ ఆధ్వర్యంలో సభ్యులకు మూడునెలల సరాసరి షుగర్ పరీక్షను చేశారు. కంపెనీ ప్రతినిధి రామాంజనేయులు గుండెపోటు వచ్చినప్పుడు తక్షణం చేయాల్సిన సీపీఆర్ విధానాన్ని వివరించారు. కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కాకుమాను రామమోహనరావు, అబ్బయ్య, సభ్యులు శ్రీనివాస్, నారాయణ, ప్రసాదరావు, మొవ్వా సత్యనారాయణ, రత్తయ్య పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి పాత జాతీయ రహదారి వెంబడి ప్రకాష్ నగర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయాలపాలయ్యాడు. సేకరించిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి మంగళగిరి వెళ్తున్న బొలెరొ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక టీవీఎస్ ఎక్స్‌ఎల్ మీద వస్తున్న ఫణీంద్ర వాహనాన్ని ఢీకొట్టాడు. రోడ్డుపై పడడంతో అతడి తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

షుగరు వ్యాధిపై అవగాహనతో దీర్ఘాయుష్షు



వైబ్రోమీటరుతో పరీక్ష చేస్తున్న డాక్టర్ కృష్ణారావు

తెనాలి: షుగరు వ్యాధిపై తగిన అవగాహనతో దీర్ఘాయుష్షు పొందవచ్చని పట్టణానికి ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్‌వీ కృష్ణారావు చెప్పారు. ప్రపంచ షుగరు వ్యాధి వారోత్సవాల సందర్భంగా స్థానిక గంగానమ్మపేటలోని కృష్ణ మెడికేర్‌లో ఆదివారం షుగరు వ్యాధి-గుండెపోటుపై అవగాహన సదస్సును డాక్టర్ కృష్ణారావు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులు దాదాపు 500 మందికి ఉచిత షుగరు రక్తపరీక్షలు, వైబ్రోమీటరుతో అరికాళ్ల స్పర్శ పరీక్షలను చేశారు. దేశంలో షుగరు వ్యాధి బాధితుల సంఖ్య శరవేగంగా పెరుగుతోందని చెప్పారు. వంశపారంపర్యం, శారీరక శ్రమ తగ్గడం, మానసిక ఒత్తిడి పెరగడం, ఫాస్ట్‌ఫుడ్స్, అధికంగా కొవ్వు, తీపి కలిగిన ఆహారం తీసుకోవడం, శీతల పానీయాల వాడకం ఇందుకు కారణమని తెలిపారు. ఆహార నియమాలు, వ్యాయామంతో షుగరును అదుపులో ఉంచుకోవాలని సూచించారు. వ్యాధి కారణంగా శరీరంలోని రక్తనాళాలు దెబ్బతింటాయని, ముఖ్యంగా కళ్లు, గుండె, మెదడు, మూత్రపిండాలు, పాదాల రక్తనాళాల్లో సమస్యలు ఏర్పడి వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. వ్యాధిపీడితులకు గుండెపోటు వచ్చే అవకాశం అయిదు రెట్లు ఎక్కువని తెలిపారు. పొగతాగడం విధిగా మానాలనీ, కంటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. సందేహాలకు సమాధానాలిచ్చారు.

వైకుంఠపురంలో సామూహిక సత్యదేవ వ్రతాలు



పూజల్లో చైర్మన్ సాయిబాబు, ఈవో అనుపమ



సామూహిక వ్రతాల్లో దంపతులు

తెనాలి: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతీసమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, వైకుంఠపురంలో శ్రీ రమాసహిత సత్యదేవ వ్రతమహోత్సవాలను ఆదివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కార్తిక మాసంలో వరుసగా ప్రతి ఆదివారం వ్రత మహోత్సవాలు ఏటా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా తెలిసిందే. ఇందులో భాగంగా 3వ ఆదివారం ఉదయం నుంచి జరిగిన వ్రతాల్లో 151 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు నేతృత్వంలో దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు భక్తులతో వ్రతాలను శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారికి ఉదయం నుంచి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. కార్తిక మాసం హరిహరాదులకు ఎంతో ప్రీతిపాత్రమైందని, ఈ మాసంలో శ్రీ సత్యనారాయణ వ్రతాలు జరిపించుకోవడం ఎంతో శుభప్రదమని అధికారులు తెలిపారు. వ్రత మహోత్సవాల్లో పాల్గొనదలచిన దంపతులు రూ.1000 చెల్లించి పేర్లు, గోత్రం నమోదు చేయించుకోవాలని ఈవో అనుపమ తెలియజేశారు.ట్రస్ట్ బోర్డు సభ్యులు బొద్దులూరి సరస్వతి నాగేశ్వరరావు, కురగంటి సునీత రవిశంకర్, దేవరకొండ వెంకట రమణ శంకరరావు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అళహరి రవికుమార్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానానికి నిలయాలు గ్రంథాలయాలు



మున్నంగి గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు



సమ్మేళనంలో పాల్గొన్న కవులు

కొల్లిపర: ప్రజలను విద్యావంతులు, చైతన్యవంతులను చేసేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి బి.నాగ సాంబశివ నాయక్ అన్నారు. ఆదివారం 57వ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా మండల పరిధిలోని మున్నంగి గ్రామ శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పద్యాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఏ. శ్రీధర్‌రెడ్డి, ఏ. జగదీశ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

తెనాలి: స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగగంగా నాలుగో రోజైన ఆదివారం 'తెలుగు భాషాభివృద్ధి-గ్రంథాలయాల పాత్ర' అనే అంశంపై కవిసమ్మేళనం నిర్వహించారు. పట్టణానికి చెందిన కవి ఆళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 13 మంది కవులు పాల్గొన్నారు. తమ కవితలను వివిధ రూపాల్లో వ్యక్తంచేశారు. బాలకవులు కూడా పాల్గొన్నారు. అనంతరం వ్యాస రచన పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి కావూరి రమాదేవి పర్యవేక్షించారు. సాయంత్రం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ గ్రంథాలయాన్ని సందర్శించారు. వారోత్సవాలపై విద్యార్థులను అడిగి తెలుసున్నారు. గ్రంథాలయాధికారి, సిబ్బందితో ఆయన మాట్లాడారు.

మాయ మాటలు.. మోసపు హామీలు

- ఇదే సీఎం చంద్రబాబు నాయుడి నైజం
- ఇప్పటికైనా ఆయన నిజ స్వరూపం ప్రజలు తెలుసుకోవాలి
- క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి
- మంగళగిరి పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: మాయ మాటలు.. మోసపు హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు ప్రశ్నిస్తారనే భయంతో ప్రజలకు కనిపించకుండా తిరుగుతున్నారని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి అధ్యక్షతన తాడేపల్లి ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వేమారెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్‌తో పాటు ఎంతో మంది సీనియర్ నాయకులను మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలను మోసం చేసి, ఓట్లు వేయించుకోవడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. తొలి నుంచి మోసం అబద్ధాలే చంద్రబాబు నైజం అన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సూపర్ సిక్స్‌లోని ఒక్క హామీనైనా నెరవేర్చాడా ? అని నిలదీశారు. చంద్రబాబు పేదలకు ఓట్ల కోసమే ఉపయోగించుకుంటాడని, అధికారంలోకి వచ్చిన అనంతరం కోటీశ్వరులు, కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడమే కోసమే పని చేస్తాడని విమర్శించారు. చంద్రబాబు నైజాన్ని ప్రజలలోకి తీసుకెళ్లి వారికి నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని పిలుపునిచ్చారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి ఆశయాలతో పాటు పేద ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టారని, ప్రస్తుతం ఎక్కడైనా ఆరోగ్య శ్రీ పనిచేస్తుందా ? అని ప్రశ్నించారు. చంద్రబాబు పాలన, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలకు తేడాలను ప్రజలకు తెలియజేసి, ఎప్పుడూ ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీని గెలిపించుకుని, వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాటిబండ్ల కృష్ణమూర్తి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఈదులమూడి డేవిడ్ రాజు, గంగాధరరావు, ఎండీ గోరెబాబు, దర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి కాంక్షించే సామాజిక వర్గం గౌడ

ఘనంగా గౌడ వన సమారాధన

తాడేపల్లిరూరల్ : ఇప్పటం గ్రామంలోని మామిడి తోటలో తాడేపల్లి మండల గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గౌడ వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొని, మాట్లాడారు. వన సమారాధన జరుపుకోవడం చాలా సంతోషదాయకమని, గౌడ అంటే కల్లు గీతకు, వెనుకబడిన వర్గంగా కాకుండా రాష్ట్రంలో అభివృద్ధిని కాంక్షించే పెద్ద సామాజిక వర్గమన్నారు. సర్దార్ పాపారాయుడి పౌరుషం, సర్దార్ గౌతు లచ్చన్న ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రముఖ సినీ నటుడు తల్వార్ సుమన్ మాట్లాడుతూ వన సమారాధన ఆత్మీయత, ఐక్యతకు ప్రతీకన్నారు. భవిష్యత్ తరాలకు కూడా మేలు చేకూర్చే వృక్షజాతిని సంరక్షించాలని కోరారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ గౌడ జాతి నాయకత్వం పెరిగిందని, రాజకీయంగా అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. చాలామంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఉన్నారని గుర్తు చేశారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడతూ.. అందరూ ఏకతాటిపై సోదర భావంతో ఒకరికొకరు సాయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. తాడేపల్లి మండల గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇప్పటంలో గౌడ సంఘం ఎనిమిదవ వార్షికోత్సవం జరుపుకోవడం చాలా ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఈవీ నారాయణ, గౌడ సంఘం నాయకులు లచ్చి తులసి దాసు, కంచకర్ల కాశయ్య, పలగాని నాగబాబు, ఐఎఫ్ఎస్ అధికారి శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సినీ నటుడు సుమన్‌ను సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు